# దళిత సత్యం

స్మశానంలా కనిపిస్తోంది ఆకాశం.

దూరపు చితిమంటల్లా కనిపిస్తున్నాయి నక్షత్రాలు.

కాటి కాపరిలా కనిపిస్తున్నాడు చంద్రుడు.

అంతఃపుర గవాక్షంలోంచి ఆకాశాన్ని చుదుతోంది హరిశ్చంద్రుని చూపు. ఆ చూపు మెల్లగా నేలమీదకి దిగింది.

సరయూ నది పక్కలో బిడ్డలా పడుకునుంది అయోధ్య. ఆ నది సవ్వడి తల్లి జోలలా ఉంది. మధ్య మధ్యలో బిడ్డ అలికిడిలా నగరపు కావలి వాళ్ళ హెచ్చరికలు, కాగడాల కదలికలు, వీధి కుక్కల అరుపులు.

నగరానికి వారగా నది ఒడ్డున స్మశానంలోంచి ఏవేవో వెలుతురులు.

ఆ సమయంలో అక్కడ ఏముంటుందో, ఎవరుంటారో అతనికి బాగా తెలుసు. కాపాలికుల పూజలు, కపాలాల వెదుకులాటలు; నక్కల పరుగులు, ఊళలు; దహనాల నుంచి కమురు కంపు, పొగ; గుడ్లగూబల కూతలు. అన్నిటి మధ్య పాలకుడిలా కాటికాపరి.

ఆ మహారాజుకి ఆ దృశ్యాలన్నీ కళ్ళగడుతున్నాయి. శబ్దాలు చెవులబడుతున్నాయి. ఆ వాసనలు వెంటబడుతున్నాయి. ఒకటా- రెండా- పన్నెండు మాసాల జీవితానుభవం. మొన్న ఉదయం వీరబాహుడు కాటికాపలా పని మీదకి పంపేటప్పుడు కూడా ఆ జీవితం ఆ దినమే శాశ్వతంగా ముగియబోతోందని తెలియదు.

మొన్న ఉదయం-

పని నించి వచ్చేటపుడు కల్లు తెమ్మని కుండ యిచ్చాడు. భుజాన పెట్టుకున్నాడు. చలికి యజమాని యిచ్చిన గొంగళీ; పురుగూ పుట్రల నించి రక్షణ కోసం, మంటలు ఎగసన

దోయటానికీ చేతిబడితా తీసుకున్నాడు. తీసుకుంటూ ఏమనుకున్నాడు? ఏ పురుగయినా కుడితే ఏమవుతుంది - చనిపోతాడు - సమస్త ఋణాలూ, కష్టాలూ తీరిపోతాయి. అది తప్పు. తనని కొనుక్కున్న యజమానికి నష్టం తేవటం అసత్యమాడినట్లే గదా!

చిరిగిన గుడ్డలూ, పెరిగిన గడ్డము.

స్మశానంలో అడుగు పెట్టేసరికి -

ఈ జీవితమెంత విచిత్రమైనదో బుద్ధికి గుర్తొస్తుంది. ఈ జీవితమే అందుకున్న శత్రువుల అవనతమస్తకాల స్పర్శలూ, ప్రజల జయజయ ధ్వానాలూ, మహర్షుల మంగళ ఆశీర్వచనాలూ, హంసతూలికా తల్పాలూ, మణిరత్నఖచిత నివేశనాలూ - కొన్నివేల మంది దాసదాసీలతో తులతూగడాలూ - అన్నీ పోగొట్టుకుని తానే దాసుడవటం - హృదయానికి గుర్తొస్తుంది. హృదయానికి పట్టరాని దుఃఖం. దాన్ని తప్పుపట్టి, సుఖ దుఃఖాలను సమభావనతో చూడమంటుంది బుద్ధి.

ఆ రోజూ ఎప్పటిలాగే పనిలో నిమగ్నమయాడు. చెట్టు ఎక్కి, గంటు పెట్టి, కల్లు కోసం కుండ కట్టాడు. రెండు శవాల కోసం గోతులు తవ్వాడు. మరో మూడు శవాల కోసం పుల్లలు కొట్టాడు. వచ్చిన మాడలు జాగ్రత్త చేసాడు. శరీరమంతా నొప్పులు. తోటివాళ్ళు కల్లు తాగుతారు. నొప్పులు వదిలిపోతాయి మహరాజా - అంటారు. తను తాగడు. మొదటి రోజుల్లో తనని పనిచేయవద్దనేవారు. తాను ఒప్పుకోలేదు. క్రమంగా తాను పనిచేస్తుంటే చూడలేక దూరంగా పోయేవారు.

క్రమంగా పొద్దు కుంగుతోంది. బలహీన పడుతున్న సూర్యుడిని మింగేస్తున్నాయి చీకట్లు. విశ్రాంతి కోసం ఓ చెట్టు మొదట్లో కూర్చున్నాడు. కళ్ళు మూతలు పడకుండా ఉందామన్నా దేహం సహకరించటంలేదు. ఏవేవో భయంకరమైన కలలు. మెలకువ వచ్చింది. గాఢాంధకారం. సమయమెంతో తెలియటంలేదు.

ఎవరో స్త్రీ రోదన. అటు నడిచాడు. అల్లంత దూరాన చితి వెలుతురులో దృశ్యం కంటపడగానే పట్టరాని కోపం వచ్చింది. ఒక ఆడది కర్రలు ఏరి చితి పేరుస్తోంది.

"ఇంత రాత్రి వేళ నేను కాస్త ఏమారి ఉండగా వచ్చి, నా అనుమతి లేకుండా, సుంకం చెల్లించకుండా చితి పేరుస్తావా? ఎంతకు తెగించావే" - అంటూ ఆ చితిని చెల్లాచెదురు చేసేసాడు.

ఆమె ఏడుపుతో మనసు కరిగిపోతోంది. అయినా సుంకం చెల్లించవలసిందేనన్నాడు. కాటి సుంకంగా ఒక మాడ ధనమూ, బియ్యం, బట్టా యివ్వాలని చెప్పాడు. ఆమె ఓ దాసి అనీ, చనిపోయినదామె బిడ్డ అనీ, పేదరాలనీ, సుంకం చెల్లించలేదని తెలిసి జాలిపడి - నావంతు నేనొదులుకోగలను గాని, నా యజమానికి సుంకం ఈయక తప్పదన్నాడు.

అప్పుడు తెలిసింది ఆమె శైబ్య - ఆ శవం లోహితాస్యునిది.

గుండెలు బద్దలయాయి. ఒకరిని పట్టుకుని ఒకరు ఏడుపు. సమయం కూడా లేదు. తెలవారితే ఎవరి యజమానులను వారు సేవించవలసిందే - లేదా వారి అనుమతి తీసుకుని రావాలి. తన యజమానురాలు కాలకంటకి బిడ్డ శవదహనానికే పనులన్నీ పూర్తయ్యేవరకూ పంపలేదుట. శవదహనం పూర్తి చేద్దామంది. ఆ సమయంలో కూడా ధర్మం తప్పనన్నాడు. నీ యజమానినే అడిగి సుంకం తెమ్మన్నాడు.

శైబ్య ఏడుస్తూ బయలుదేరింది. అప్పుడు కూడా ధర్మం మరవలేదు. సత్యం విడవలేదు. - చండాలుడి సేవకుడిని ముట్టుకున్నావు. గంగలో మునిగి స్నానంచేసి మరీ వెళ్ళమన్నాడు. చనిపోవాలనిపిస్తుందేమో ఆ పని చేయకు. యజమానికి నష్టం చేసే పని దాసి చేయరాదన్నాడు.

బిడ్డ శవం ముందు కూర్చుని నిస్సహాయంగా విలపిస్తున్నాడు. ఎంతకీ గాలేదు శైబ్య. రాజభటులు శైబ్యని తీసుకుని వచ్చారు. రాచబిడ్డను ధనం కోసం చంపిందన్నారు. వధించమన్న రాజాజ్ఞను తెలిపారు. చివరికి అందుకూ సిద్ధమయ్యాడు.

గడచిన రాత్రి సంఘటనలు గుర్తొస్తూనే ఉన్నాయి. మనసు తర్క వితర్కాలు చేస్తూనే ఉంది. తెగిపడబోతున్న శైబ్య శిరస్సు జ్ఞాపకంతో అతను నిలువెల్లా వణికిపోయాడు. విశాలమైన ఆ గదిలో గవాక్షం ముందు నించున్న మనిషి మరోవైపు ఉన్న తల్పం దగ్గరకి ఒక్క అంగలో కదిలాడు. చెరువు లాంటి మంచం మీద చిగురుటాకులా ఉంది శైబ్య. నిదురపోతున్న ఆమె మోములో ఏదో ఎనలేని ప్రశాంతత. ఎదుటివారి హృదయాలను వెలిగించే వెలుగు.

ఏమిటి వాటికి మూలం?

విశ్వాసం! భర్తే గురువు - దైవం - రక్షకుడు - ఆ విశ్వాసమే ఆమె అంతః బహిర్ప్ర చాలకు రూపమూ, సారమూ. పుట్టినదాది లభించిన ఎఱుక, శిక్షణ. వివాహానంతరం ఆచరణ. భర్త వెంట అడవులకు నడిచింది. అమ్మితే అమ్ముడు పోయింది. చిట్టచివరకు పెనిమిటి కర్తవ్యతా విమూఢుడైనపుడు రాజాజ్ఞను మీరటం అధర్మమని చెప్పి తనను వధించమని ఖడ్గం చేతబెట్టి వధ్యశిలపై తల నుంచింది.

అనుకంపతో గౌరవంతో కదిలిపోతూ ఆమె తల మీద చేయి వేసాడు.

చటుక్కున ఆ చేతిని పట్టుకుంది శైబ్య. ముందు మెరిసిన భయం, పరిచిత స్పర్శతో కలిగిన భద్రతా భావం - గమనిస్తున్న అతన్ని ఓ ప్రశ్న కుదిపేసింది.

నిదురలో కూడా తన స్పర్శతో ఏదో రక్షణ లభించినట్లై పోయిన ఈ స్త్రీకి తనేం రక్షణ ఇచ్చాడు?

విశ్వామిత్రుడి దండన ఇచ్చాడు. అడవులు ఇచ్చాడు. ఊడిగం ఇచ్చాడు. మరణం ఇవ్వబోయాడు.

2

విలవిలలాడింది అతని మనసు.

అతని కళ్ళు తడిదేరాయి. రెండు ఇందుప గింజలంత కన్నీటిబొట్లు శైబ్య చేతిమీద పడ్డాయి. ఒక్కమారు కళ్ళు విడాయి. అంతే – ఆమె గుండె దిగ్గుమంది.

"ఏమిటి ఆర్యా – ఈ వేదన" అంటూ లేవబోయింది.

అంట్ల పనితో కాయలు కాసిన అరచేతులను తడుముతున్నాడు. చేతులు వెనక్కి లాక్కోబోయింది.

"ఎన్ని కష్టాలు పెట్టాను దేవీ!" అన్నాడు.

ఆమె అతన్ని గుండెల మీదకి లాక్కుంది.

"ఈ కష్టాలన్నీ పడ్డది నా కోసమే" – అంది.

ఆమె కళ్ళలోకి అయోమయంగా చూసాడు.

"మీరారోజున విశ్వామిత్ర మహర్షి కుమార్తెలను వివాహమాడితే ఎలాంటి కష్టాలూ ఉండేవి కాదు."

"వెర్రిదానా!"

"పురుషులకి ఎన్ని వివాహాలైనా ధర్మసమ్మతమే!"

"వారు మాదిగ కన్యలు"

"మీ మనసు మీకే తెలియదు. అదే నిజమయితే ఆ మాదిగకే దాస్యం చేయరు."

"మాదిగకి దాస్యం చేయలేను. నన్ను మీరే దాసుడిగా చేసుకుని ఋణవిముక్తుడిని చేయండి బ్రహ్మర్షీ అని విశ్వామిత్రుడిని వేడుకున్నాను. గుర్తులేదా?"

"మీరామాట అన్నారు – నిజమే – సాటి కులస్తుడని కనికరం చూపుతాడని అలా అన్నారు. దానికి ఆయన ఏమన్నాడు! కల్పతరువు కావాలా – కామధేనువు కావాలా – కోరిన కట్నం ఇస్తా – ఈ మాతంగ కన్యలను వివాహం చేసుకో – రాజ్యాన్ని ఏలుకో – సుఖపడు అన్నాడు. కాని, మీరు అంగీకరించలేదు."

హరిశ్చంద్రుడు ఆలోచనలో పడ్డాడు.

"ఆర్యా! మాదిగకి సైతం దాస్యం చేసారు. ఇదంతా నా మీద అనురాగఫలితమే!" – అంటూ ఆమె అతన్ని మరింతగా అల్లుకుపోయింది.

"నీ వాదనను అంగీకరించలేను దేవీ! సత్యమేదని ఆలోచిస్తే – అన్నీ సత్యమేనని ఓమారు

అనిపిస్తే, అన్నీ అసత్యమేనని ఓమారు అనిపిస్తోంది."

అతని మాటల నించి ఆ మనసులోని ఆరాటం అవగతం చేసుకోటానికి బుద్ధిని సన్నద్ధం చేసుకుంది శైబ్య.

"సత్యం గురించి సందిగ్ధంలో పడిన తొలి సందర్భం నాకింకా గుర్తే. బిడ్డల కోసల మన పురోహితులు వసిష్ఠ మహర్షి ఆదేశం ప్రకారం వరుణదేవుని కోసం తపస్సు చేసాను."

"నాకు తెలిసిందేగదా?"

"నీకు చెప్పనిదొకటుంది. 'నీకు బిడ్డనిస్తాను. నీవు నాకేమిస్తావు' అన్నాడు వరుణుడు. ఆనందంతో ఒళ్ళు తెలియలేదు. 'నీవిచ్చిన బిడ్డనే నీకిస్తాను' అన్నాను. ఆ మాటకి ఆయన సంతోషిస్తాడనుకున్నాను. ఆశీర్వదిస్తాడనుకున్నాను."

"సహజంగదా!"

"లోహితాస్యుడు పుట్టాడు. మన ఆనందానికి అవధులు లేవు. జనమంతా పండగ చేసుకున్నారు. ఆ సమయంలో వరుణుడు వచ్చాడు. నాకిస్తానన్నది ఇవ్వమన్నాడు. తెల్లబోయాను. కాళ్ళా వేళ్ళా పడ్డాను. పళ్ళు వచ్చేవరకూ గడువు ఇమ్మన్నాను. సరే అన్నాడు. అప్పటినించి ఏదో మిషతో వచ్చినపుడల్లా గడువు అడుగుతూ గడిపాను. ఆయన వచ్చేముందు చదువు కోసం మన లోహితాస్యుడుని అడవులకి పంపాను."

"అంత పసివాడిని వదలలేక ఆనాడు ఎంత దుఃఖించానో!"

"నీది ఒక్కటే దుఃఖం శైబ్యా! నాది? నీ వేదన చూడలేను. నా వేదన చెప్పుకోలేను. రేపో మాపో నా చిన్నారి తండ్రిని నా చేతులతో నేనే బలి ఇవ్వాలన్న విషయం గుండెలను కోసేసేది. అసత్యమాడానన్న బాధ నిలువెల్లా దహించి వేసేది."

"అయ్యో స్వామీ! ఎంత నలిగిపోయారు. వరుణుడు కరుణ చూపాడా?"

"లేదు. మన లోహితాస్యుడే ఆ గండం గట్టెక్కించాడు. వరుణుడు నాకు అజీర్తి రోగంతో బాధపడమని శపించాడు. అడవులలో ఉన్న మన బిడ్డ ఆ సంగతి తెలిసి మునీంద్రులని మెప్పించి తన స్థానంలో మరొక బాలకుడిని బలి ఇవ్వవచ్చుని గ్రహించాడు. శునశ్శేపుడిని కొనుక్కుని వచ్చాడు."

భర్త మాటలు ఆగిపోవటంతో శైబ్య అతని ముఖంలోకి చూసింది.

అతని కళ్ళు మూసి ఉన్నాయి. ఆలోచనతో భృకుటి ముడిపడి ఉంది. విప్పారిన కళ్ళతో చూస్తూండి పోయింది.

అతను అసమ్మతిగా తల ఊపుతూ తిరిగి ఆరంభించాడు.

"అప్పటినుంచి ఇచ్చిన మాట జవదాటడం అసత్యమనుకున్నాను. ఆ పని ఎన్ని కష్టాలు

వచ్చినా చేయరాదని నాకు నేనే ప్రతిన చేసుకున్నాను. సమస్త ఐశ్వర్యాలూ, అధికారాలూ గల చక్రవర్తిని. నా వ్రతం నాకు కష్టమేమీ కాలేదు. ఇటు మన పురోహితులు వసిష్ఠ మహర్షితో మన వర్ణస్తులు విశ్వామిత్ర మహర్షి పంతాలకు దిగి నన్ను ఇక్కట్లు పెట్టారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు, అంతా సుఖాంతమైనందుకూ సంతోషమే గాని..."

"చెప్పండి ఆర్యా!"

హరిశ్చంద్రుడు కళ్ళు విప్పి ఆమెను చూస్తూ అదోలా నవ్వాడు.

"ఎవరితోనూ చెప్పవుగదా?" అన్నాడు.

"అదేమిటది?"– తనూ నవ్వుతూ అంది.

"నా ఆలోచనలు చెపితే వాటి మీద నిలబడమని పట్టుబడతావేమోనని.."

"మీకు కష్టాలు వస్తే నాకూ కష్టాలేగదా – భయపడకండి."

"శైబ్యా! విశ్వామిత్ర మహర్షి యాగం కోసం సొమ్మడగటం, తీసుకొమ్మంటే వద్దని ఉంచమనటం, ఆ తర్వాత తన కూతుళ్ళను వివాహమాడమనటం, కావాలంటే రాజ్యమయినా వదులుకుంటాను గాని వారిని పెండ్లాడననటం, ఆ మాట పట్టుకుని నా రాజ్యం తీసేసుకోటం, తీసుకున్నాక ఋణం తీర్చమనటం – ఇదంతా మోసం కాదా? ఇది వంచనతో ఋణస్తుడిని చేయటమేగదా!"

శైబ్య ఏదో అనబోయింది.

"ఆలోచించు శైబ్యా! నిజమే ఇదంతా నాకు పరీక్షే! కాని ఇలాంటి వంచనకి తలొంచటం సత్యపాలన అవుతుందా? నాతోబాటు పన్నెండు మాసాలు తిరిగిన వారణాసి కాటికాపరులు ఏమన్నారో తెలుసా! మీలాగే మేమూ అప్పులు తీర్చటం కోసం భార్యాబిడ్డలని అమ్ముకుంటాం – దాస్యం చేస్తాం. వారా మాటను అన్నపుడల్లా – నాకు ఒక్క మాట చెప్పాలనిపించేది. వంచించి, అప్పుల్లోకి నెట్టితే అది ఋణం కాదు. దాన్ని తీర్చటానికి మిమ్మల్ని మీరు అమ్ముకోరాదు. – కాని, చెప్పలేకపోయాను."

"ఎందువల్ల?"

"ఏమో!" అతని స్వరంలో నిజాయితీ ధ్వనించింది.

శైబ్యకీ ఆలోచన తెగలేదు.

"చింకిపాతలతోనూ, శవాల మీద బట్టలతోనూ శరీరం కప్పుకుని, ఆహారం కోసం జంతువులతో సమానంగా అడవుల మీద ఆధారపడుతూ జీవించే ఆ మందభాగ్యులు – నన్నెంత అభిమానంగా చూసేవారో చెప్పనలవికాదు. 'అయ్యయ్యో మహరాజా నీకెంత కష్టం వచ్చిందయ్యా' అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకునేవారు. శవాల మీద బట్ట నేను కట్టరాదట.

ఎక్కడెక్కడో పనిచేసి తెచ్చి కొత్త బట్టలు ఇచ్చేవారు. తీసుకోనంటే – 'నువ్వు మహారాజువి. మా తండ్రివి. మా ఈ చిన్న పూజ అందుకోదగదా?' – అనేవారు. ఎంత మంచి మనసు వారిది."

"మీరన్నది నిజం ఆర్యా! నా యజమానురాలు నన్నెంత రాచి రంపాన బెట్టినా సాటి దాసదాసీలు మాత్రం 'మహారాణికి ఎంత కష్టం వచ్చిం'దని కంటికి మంటికి ఏకధారగా ఏడిచేవారు."

"మనలనంత ప్రేమించే వారితోనైనా మనసుకి అనిపించే విషయం చెప్పకపోవటం అసత్యమాడినట్లేగదా!"

శైబ్యకి మాట రాలేదు.

పెద్దగా నిట్టూర్చాడు హరిశ్చంద్రుడు.

"శైబ్యా! నిన్నటిదాకా అనుభవించినవి భ్రమో – ఈనాటి ఈ వైభవం భ్రమో! అన్న మాటకి నిలబడటం సత్యపాలనమో – మనసులో ఉన్నమాటకి నిలబడటం సత్యపాలనమో! ఏది ఏమయినా, ఇప్పుడు విశ్వామిత్ర మహర్షి చేసిన దానితో ఇంక ఎవ్వరికీ ఏ మాటా ఇవ్వరాదని అనుకుంటున్నాను" – దృఢంగా అన్నాడు హరిశ్చంద్రుడు.

"మీరేం చేసినా మీ వెంట నడిచేదానను. నాకేం తెలుస్తుంది స్వామీ!"

వద్దువద్దన్నట్లు తలూపుతూ ఏదో అనబోయి మానేసాడు.

"ఏమిటీ – ఆగిపోయారు?"

"మనసులో మెరిసిన ఆలోచన..." అంటూ ఆగి, "...లన్నింటికీ మాటలుండవు దేవీ!" – అంటూ ఓ తెచ్చిపెట్టుకున్న చిలిపి నవ్వుతో ఆమెని తన కౌగిట్లోకి తీసుకున్నాడు.

3

అది సరయూ నది సమీపంలో అయోధ్యా నగర స్మశానం.

నదినీ, అడవినీ తన కిరణాలతో ముస్తాబు చేస్తోంది వెన్నెల. ఆ వెన్నెలను ముక్కలు ముక్కలు చేస్తోంది చెట్ల నీడలలో పొంచున్న చీకటి. ఆ బాధకు కన్నీరు మున్నీరవుతోంది వెన్నెల. ఆ కన్నీటి తడి ఆ హింసకే కారణమైన చెట్లకే మరింత అందాలు పూస్తోంది. ప్రాణం పోస్తోంది.

ఆ నిష్కామ కర్మతో ప్రేరేపితుడయినట్లున్నాడు – కాటికాపరి – చితిమంటలని సరిచేస్తున్నాడు. అన్నీ అయాక వచ్చి తనకోసం ఏర్పరుచుకున్న చోటులో కూర్చున్నాడు. తడి పుల్లల పొగకి అతని కళ్ళు మండుతున్నాయి. 'ఒక్కో కట్టె ఎంతకీ తగలడదు – ఏమిటో ఆ మాయ' – అనుకుంటున్నాడు. అల్లంత దూరాన ఎవరో మనుషుల అలికిడి.

'నది దాటి వచ్చినట్లున్నారు. ఊరి వాళ్ళే అయుంటారు. కాటి భయం ఉంటుంది' - అనుకున్న కాటికాపరి గొంతెత్తి అరిచాడు.

"భయపడకండి బాటసారులూ - నేను కాటికాపరిని. మనిషినే. కాడు దాటేవరకూ తోడుంటాను."

అటునించి ప్రత్యుత్తరంగా - "మేమూ కాటికాపరులమే" - అని వినిపించింది.

కాగడా ఎత్తి చూసాడు.

ముగ్గురు మనుషులు సమీపించారు.

"ఏ ఊరయ్యా మీది?"

"వారణాసి"

"ఏమిటీ - వారణాసే!? మా పేటలో చుట్టాలున్నారా?"

"కోటలోనే ఉన్నారు"

"ఎవరండీ వారు?"

"ఇంకెవరూ - ఆడినమాట తప్పని మహారాజు - ఆ సత్య హరిశ్చంద్ర ప్రభువే!"

"మా ప్రభువు మీకు చుట్టమా! ఏమిటండీ వేళాకోళాలు?"

నలుగురూ ఓ మంట చుట్టూ చేరారు. చేతులు కాచుకుంటూ, వాటితో ఒళ్ళూ, మొహమూ వెచ్చజేసుకుంటూంటే మాటలు సాగాయి.

'మా ఊరి కల్లు రుచి చూడం'డంటూ ఒకరిదొకరు పంచుకున్నారు.

"ఆయన హరిశ్చంద్ర మహారాజని తెలియగానే మాకు కాళ్ళూ చేతులూ చల్లబడ్డాయి. ఆ ముని చేసిన పని విని మా కడుపుడికి పోయింది. 'మీరు ఊం అనండి. ఆయన పని పడతాం' - అన్నాం. 'ఎంతటి ధర్మాత్ముడు! తప్పు తప్పు' - అన్నాడు. 'మీరు పని చేయనవసరం లేదు. మీ పనీ మేమే చేస్తాం. మీరో పక్కన కూర్చోండి' - అన్నాం. 'నేను దాసుడిని. నా పని నేను చేసుకోకపోతే అసత్యమాడినట్లే' - అన్నాడు. మనబోటి కడజాతి వాళ్ళలా ఆయన పని చేస్తూంటే - చూడలేక, చూస్తూ ఉండాల్సి వచ్చి - కంటతడి పెట్టని దినం లేదు."

చెపుతూ ఉన్న పెద్దయ్య గొంతు రుద్ధమయింది.

"ఊరుకో పెద్దయ్యా - ఆ మహారాజు కష్టాలు తొలగిపో యాయి గదా!" - అన్నారు ఒకరు.

అయోధ్య కాటికాపరి కూడా ఉత్తేజితుడయాడు.

"ఏమి పుటక మీది! ఆ మహరాజుతో ఏడాది తిరిగారు. ఆయన మాటలు విన్నారు.

మీ పాదాలు ముట్టుకుంటే ఈ జన్మకదే పదివేలు" అంటూ దణ్ణాలు పెట్టాడు.

"మీరు ఆ మహారాజుని కలుసుకోటానికి పోతున్నారు. ఏమడిగినా ఇస్తాడు. మీకు దొరికిన దానిలో నాకూ ఓ కూరాకు పెట్టండయ్యా – మీ పేరు చెప్పుకుని నేనూ నా ఆలుబిడ్డలూ బతుకుతాం" – అన్నాడు.

వాళ్ళు ఒకరి ముహాలు ఒకరు చూసుకున్నారు.

"మేమా మహారాజుని సిరులడగటానికి రాలేదు"

"ఏకంగా రాజ్యమే పుచ్చేసుకుందామనుకుంటున్నారా – ఆ మునిలాగ? ముందే చెప్పండి. ఇక్కడకిక్కడే మీ పుచ్చెలు ఎగిరిపోతాయి" – అన్నాడు ఉద్రేకంగా.

వాళ్ళు ఒకటే నవ్వు.

"మనకెందుకయ్యా రాజ్యాలూ! మేమడుగుదామనుకుంటున్నదేమంటే..." – అంటూ మొదలు పెట్టారు.

"పుట్టిన ప్రతి మనిషికీ చావు తప్పదు. ఆ శవాల ఖననానికో, దహనానికో ప్రతీ వాళ్ళూ మన దగ్గరకు రాక తప్పదు. వచ్చిన వాళ్ళందరి వద్దా మాడలుంటాయా? లేనివాళ్ళు సుంకం కట్టలేరు. అందుకని తమ వాళ్ళ శవాలను నక్కలకో కుక్కలకో పీక్కుతినటానికి వదిలేయలేరు. ఏ చీకటిలోనో చేయబోతారు. మనకి దొరికిపోతారు. తన్నులు తింటారు. మన కాళ్ళ మీద పడతారు. వదలలేం. వాళ్ళ ఏడుపు చూడలేం. అందుకని..."

"అందుకని?"

"సుంకం కట్టలేని పేదలకు స్మశానం ఉచితంగా ఇవ్వాలని కోరటానికి వచ్చాం."

"ఆ మహారాజు సావాసం వల్లనే మీకింత మంచి బుద్ధి పుట్టింది. నిజంగా ఆయన ఒప్పుకుని, కాటి చట్టం మారిస్తే మనకీ, ప్రజకీ ఎంత ఉపకారమౌతుంది!"

"ఎందుకు ఒప్పుకోడు – ఆయన స్వయంగా అనుభవించిన బాధ అది."

"అవునవును. తప్పకుండా మన విన్నపం మన్నిస్తాడు."

వారి ముచ్చట్లు సాగుతున్నాయి.

క్రమంగా సూర్యాగమనాన్ని మోసుకొస్తున్న వెలుగు రేఖలు తూర్పు దిశలో మొలకలెత్తాయి.

## 4

"వారణాసి వాసులట. కాటి కాపరులట."

వర్తమానం అందించారు భటులు.

మంత్రుల మధ్యనున్న హరిశ్చంద్రుడు ఉద్విగ్నంగా లేచాడు. అతని ముఖాన్ని ఆనందం

వెలిగించింది. "ఏరీ ఎక్కడా" అంటూ ఎదురు వెళ్ళబోయాడు.

మంత్రులు చకితులయ్యారు. ఒకరి ముహాలు ఒకరు చూసుకున్నారు.

"వారిని వెంటనే ప్రవేశపెట్టండి" - మంత్రి సత్యకీర్తి ఆదేశమిచ్చాడు.

"తమరు ఆసీనులుకండి ప్రభూ" - అన్నాడు.

ఆనంద పారవశ్యంతో అతనికి జరుగుతున్నది తెలియలేదు.

తృటిలో భటులు వారిని తీసుకు వచ్చారు.

వారిని సమీపించిన హరిశ్చంద్రుడు - వణుకుతున్న దేహాలతో, ఒగ్గిన దోసిలితో వెనక్కి తగ్గుతున్న వారిని - ఆలింగనం చేసుకున్నాడు.

"రండి, కూర్చోండి" అంటున్నాడు.

భయ సంభ్రమాలతో నోరు పెగలని ఆ మానవులు అలాగే నిలుచుండిపోయారు.

"పెద్దయ్యా! బాగున్నావా? గొయ్యి తవ్వటానికి మొదటిసారి గునపం పట్టుకున్నపుడు నువ్వు చెప్పిన పాఠం ఇంకా గుర్తుంది - 'ఇది కత్తి కాదు మారాజా గునపం. ఇలా పట్టుకోవాలి - తవ్వేటపుడు చేతులు ఇక్కడుండాలి. పెళ్ళగించేటపుడు ఇక్కడుండాలి' - అన్నావు. మంట సరిచేసేటపుడు, ఎలా చేయాలో తెలియక, కాలుతున్న పుల్లలని కాళ్ళ మీద వేసుకుంటే నువ్వు పడిన బాధా, చేసిన ఉపచారాలూ ఎలా మరువగలనయ్యా" - అంటూ ఏవోవే మాటలాడుతున్నాడు హరిశ్చంద్రుడు.

"అల్పులతో సహవాస ఫలం" - అన్నాడొక మంత్రి జనాంతికంగా మరొకరితో.

కొంతసేపటికి - అతను ఈ లోకంలోకి వచ్చాడు. మంత్రుల హెచ్చరిక, దగ్గులు తన స్థితిని గుర్తుచేసాయి. స్వాభావిక ఆవేశాన్ని అదుపు చేసుకుంటూ మహారాజులు శిక్షణతో అభ్యసించి అలవరచుకున్న గాంభీర్యాన్ని అంతటా కప్పుకుంటూ అన్నాడు.

"మాటలాడవేం పెద్దయ్యా! ఏం కావాలి మీకు?"

ఆ మహారాజు అరమరికలు లేని మాటలకు చెమ్మగిల్లిన కళ్ళతో, మూగవోయిన గొంతు సరిచేసుకుంటూ, బలిష్టమైన విశాలమైన తన దేహం కుంచించుకుపోతూండగా అన్నాడు.

"మహారాజా! మిమ్మల్ని ఇలా చూసాం. అదే మాకు పదివేలు. ఈ చిన్ని కానుకలు..."

"ఏమిటవి?"

"నువ్వెంతో ఇష్టంగా తినే తాటిపళ్ళ రొట్టెలూ, కొర్ర బియ్యం, పుట్టతేనె..." అంటూ ముందుంచారు.

"నా మీద ఎంత ప్రేమ మీకు! ఆ గడ్డు దినాలలో మీ తోడే లేకపోతే ఏమైపోయేవాడినో! చెప్పు పెద్దయ్యా ఏం పనిమీద వచ్చారు?"

సత్యకీర్తి కలగజేసుకున్నాడు.

"ప్రయాణ బడలికలో ఉంటారు వాళ్ళు. విశ్రాంతి తీసుకోనీయండి ప్రభూ!"

"బాగా గుర్తుచేసారు. వారు మన అయోధ్యకే అతిథులు. తగిన సౌకర్యాలు సమకూర్చండి" అన్నాడు హరిశ్చంద్రుడు.

"మన్నించు మహారాజా! మీకు తెలియనిదేముంది వారణాసిలో మా పని. ఒక చిన్న కోరికతో వచ్చాం."

"ఏమిటది?" వెంటనే అడిగాడు సత్యకీర్తి.

చెప్పాడు పెద్దయ్య.

అంతటా నిశ్శబ్దం.

హరిశ్చంద్రునికి ఒక్కమారుగా నవ్వు ఉప్పొంగింది. దానిని ఎలా అర్థం చేసుకోవాలో తెలియని మంత్రులు ఒకరి ముహాలు ఒకరు చూసుకున్నారు. ఆయన నవ్వుకి బిత్తరపోయారు వారణాసి పౌరులు.

అంతలోనే – తన బిడ్డ శవాన్ని కాల్చుకోనివ్వమని ఏడుస్తున్న శైబ్య గుర్తు వచ్చింది.

వారి అమాయకమైన కోరికకి కలిగిన నవ్వు స్థానంలో విషాదం చోటు చేసుకుంది.

అంత చిన్న కోరిక వెనక ఆంతర్యమేమిటా అన్న ఆలోచనలో పడ్డారు మంత్రులు.

బిత్తరపోయిన పెద్దయ్య తేరుకుని అన్నాడు.

".. అలా చట్టం మారిస్తే బీదాబిక్కీ నీ పేరు చెప్పుకుంటారు. వాళ్ళని అనుమతించే అధికారం మాకిస్తే దినదినమూ పడే బాధ మాకూ ఉండదు" – ముగిస్తూ రెండు చేతులూ జోడించాడు.

"ఎంత గొప్ప మనుషులయ్యా మీరు!" – అంటూనే ఉన్నాడు హరిశ్చంద్రుడు.

"ప్రభూ! తమరు ముందుగా వసిష్ఠుల వారితో ఈ విషయమై మాటలాడటం ఉచితం" – అన్నాడు సత్యకీర్తి.

"ఇంత చిన్న విషయమా!!' అన్నట్లు చూసాడు హరిశ్చంద్రుడు.

"ప్రభువులు తమరు. చెప్పటం మా ఉద్యోగం" – అన్నాడు సత్యకీర్తి.

అతని ఆలోచన తెమలక ముందే సత్యకీర్తి అన్నాడు.

"ఒరేయ్! ప్రభువుకి విన్నవించుకున్నారు గదా – తప్పకుండా మీ కోరిక తీరుస్తారు.

ఈ పొద్దు విశ్రాంతి తీసుకోండి. రేపు సభకి మిమ్మలని రావిస్తాం" అంటూ అతిథి మర్యాదలకు ఆదేశాలు ఇచ్చాడు.

"ఇదే సత్యకీర్తి – విశ్వామిత్రుడు యాగం కోసం సొమ్మడిగినపుడు తన ఉద్యోగం ఎందుకు

చేయలేదు? పైగా పరుల సొమ్ము విషప్రాయంగా తలచే మీకు కష్టములు రానేరావని నమ్మకంగా చెప్పాడు" - అనుకున్నాడు హరిశ్చంద్రుడు.

5

చక్రవర్తీ, మంత్రులూ వసిష్ట బ్రహ్మర్షిని వినమ్రంగా అడిగారు.

వసిష్ఠుడు ప్రశాంత గంభీరంగా చూసాడు.

"మహారాజా! ఇది చాలా స్వల్ప విషయం. నిస్సందేహంగా అనుమతించవచ్చు. స్మృతులలో గాని, ధర్మసూత్రాలలో గాని ప్రజలు ప్రభువులని ఇలా కోరటం ఎన్నడూ ప్రస్తావనకి రాలేదు. కానీ..."

"చెప్పండి"

"అడుక్కోవటం జనం చేయాలి. ఇవ్వటం ప్రభువులు చేయాలి. ఇది అనుశృతమైన పద్ధతి. ప్రభువులకి అధికారాలు, ప్రజలకి విధులూ ఉండటంలోనే రాజ్య క్షేమం ఉంది. ఇప్పుడు మీరు అనుమతించేది మీ అధికారంలో ప్రజలకి భాగం. విషయమెంత చిన్నదైనా - ఇదే జరిగితే - ఇది ఒక ఆరంభం."

హరిశ్చంద్రుడు ఆశ్చర్యంగా, అయోమయంగా చూస్తూ అసమ్మతి తొంగిచూస్తున్న స్వరంతో - "బ్రహ్మర్షీ" - అంటూ ఏదో మాటలాడబోయాడు.

చేతితో వారించి-

"చక్రవర్తీ! త్రికాలజ్ఞులం. అకారణంగా ఏదీ పలకం. లౌకిక అధికారాల పట్ల, ఐహిక భోగభాగ్యాల పట్ల విరాగులం. మా తపస్సుకీ, జ్ఞానానికీ లక్ష్యం సర్వేజనః సుఖినో భవంతు. ప్రజలైనా, ప్రభువులైనా పరిధులతిక్రమించితే తెలియబరచటం మా విధి. నిర్వర్తించాం. ఆ మీదట మీ ఇష్టం. తపస్సుకి సమయం మించిపోతోంది" - అంటూ నిష్క్రమించాడు వసిష్ఠుడు.

హరిశ్చంద్రుని వదనంలో అసమ్మతి ఆ మునిని వెన్నాడుతోంది.

"గతంలో అతని తండ్రి సత్యవ్రతుడు ఇలాగే ఓ అనుచితమైన కోరిక కోరాడు. మానవుల పరిధులలో ఉండకుండా సశరీరంగా స్వర్గ ప్రవేశం కోరాడు. తగదంటే కోపగించి తన కొడుకులను చెరపట్టబోయాడు. వారు చండాలుడివి కమ్మని శపించారు. విశ్వామిత్రుడిని ఆశ్రయించి తన కోరిక తీర్చుకోడానికి ప్రయత్నించి భంగపడ్డాడు. ఇప్పుడీ హరిశ్చంద్రుడూ అదే దోవ పడుతున్నట్లున్నాడు. ఈతడూ ఆ క్షత్రియ ఋషి విశ్వామిత్రుడిని ఆశ్రయించవచ్చు. ఆయన మళ్ళీ ఏ కొత్త సమస్యలు సృష్టిస్తాడో! త్రిశంకు స్వర్గం సృష్టించినట్లే అందరికీ అధికారాలూ, విధులూ ఉండే రాజ్యాన్ని సృష్టిస్తాడా?'

6

మంత్రి సత్యకీర్తి – "వసిష్ఠుల వారి మాట జవదాటరానిది" – అన్నాడు.

ఇంత చిన్ని అభ్యర్థనను కాదనవలసి రావటం హరిశ్చంద్రునికి చాలా చిన్నతనంగా ఉంది. విశ్వామిత్రుడిని కలుసుకోవాలన్న ఆలోచన పదే పదే రాసాగింది.

ఆయనకి వైరం వసిష్ఠునితోనే గాని తనతో కాదు. తనని కష్టాలు పాలు చేయటమూ అందులో భాగమే! గతంలో బ్రహ్మర్షులు నిరాకరించినపుడు క్షత్రియులెందరో ఆయనని ఆశ్రయించారు. ఆయన తన సర్వశక్తులూ ఒడ్డి వారి అవసరాలు తీర్చాడు. సృష్టికి ప్రతిసృష్టి చేసాడు. అంతటి మహనీయుడు – పేదలకు స్మశానాలలో శవవిధులు ఉచితంగా అనుమతించే అధికారం కాటికాపరులకు దత్తం చేయటానికి – సంతోషంగా అంగీకరిస్తాడు.

"పద సత్యకీర్తీ! విశ్వామిత్ర మహర్షి ఆశ్రమానికి పోయివద్దాం."

విశ్వామిత్రుని ముఖం ఆనందంతో విప్పారింది.

"నీ రాక నన్నెంతో ఆనందపరచింది. ఉత్తమ వంశ సంజాతుడవైన నిన్ను సాటి క్షత్రియుడవనైనా చూడకుండా పంతానికి పోయి చండాలుడి కింద దాస్యం చేయించాను. అయినా నీవు నిలబడ్డావు. నేను వసిష్ఠుని ముందు ఓడినా, క్షత్రియుల పేరు నిలబడింది. నీ రాకకు కారణం చెప్పు"

చెప్పాడు హరిశ్చంద్రుడు.

విశ్వామిత్రుడు ఆలోచనామగ్నుడయాడు.

"ఏమిటి బ్రహ్మర్షీ! మౌనం?"

అతని సంబోధనలోని ఆంతర్యాన్ని గ్రహించినట్లు నవ్వాడు.

"హరిశ్చంద్రా మా వైరం జగద్విఖ్యాతం. అసలు అధికారం బ్రాహ్మణునిదా – క్షత్రియునిదా అన్నదే దానికి మూలం. బ్రాహ్మణాధికారం కోసం, బ్రాహ్మణుడననిపించుకోవటం కోసం, బ్రహ్మర్షిని కావటం కోసం నేనెన్ని పాట్లు పడ్డదీ, పడుతున్నదీ నీకు తెలుసు. పాలనాధికారం మనకిచ్చి, శాసనాధికారం వారుంచుకున్నారు. ఋషినై, క్రతువులు చేయించి, వేదసూక్తాలకు కర్తనై వారు చేసేవన్నీ నేనూ చేసాను. కాని నన్ను వారు గుర్తించలేదు–"

'ఇదంతా ఎందుకు చెపుతున్నట్లు' అని ఆలోచిస్తున్నాడు హరిశ్చంద్రుడు.

"కారణమేమిటి? నేను కోరినది వారి అధికారంలో భాగం. ఇలా వారూ, మనమూ అధికారంలో భాగాలు తెగక పోట్లాడుకోటం ఉచితమైనా కాకున్నా అది అనివార్యం. కారణం అధికారపు రుచి. అర్థమయిందా హరిశ్చంద్రా!"

"ప్రయత్నిస్తున్నాను"

"మేం తపస్సులు చేసుకోవాలన్నా, మీరు రాజ్యాలు ఏలుకోవాలన్నా ప్రజ పని చేయాల్సిందే! ఈ విషయం బాగా నమ్ము. పనిని నీచంగా ముద్రవేసి, పనిచేసేవారిని నీచులుగా, అల్పులుగా, దాసులుగా, చండాలురుగా నమ్మింపజేయగలిగితేనే వారు మరేదీ ఆలోచించకుండా పని చేసుకుపోతారు. పనివాళ్ళు తమకి విద్యుక్తమయిన పనిలో విచక్షణ ఉపయోగించటాన్ని ఆశించటం కాటికాపరుల కోరికలో ఉంది. దాన్ని మొగ్గలో తుంచకపోతే, వారికి అధికారపు రుచి చూపించితే ఏం జరుగుతుందో ఆలోచించు. ఇదంతా ఆలోచించగలిగారు కనకనే వసిష్ఠుల వారు అంత నిర్ద్వందంగా చెప్పారు."

"విచక్షణ ఉపయోగించటం అంత ప్రమాదకరమా? అందరికీ అధికారాలు ఉంటే మనకి నష్టం ఏమిటి? నాకలా అనిపించటం లేదు" అన్నాడు హరిశ్చంద్రుడు.

చిన్న నవ్వు ఆ మునీంద్రుని పెదవుల మీద మెరిసింది.

"ఇదే ఇదే విచక్షణ అంటే!" అన్నాడు.

అన్నాక ఆగి-

"సైనికుడు యుద్ధం చేయడు. వాడిని కూర్చోబెట్టి మేపి, మనకోసం చచ్చేందుకు, చంపేందుకు రైతు పండించడు. అప్పుడు నీవు చక్రవర్తివి కాలేవు. నీ వంశం పేరుకెక్కదు. నీ జాతి గౌరవం నిలవదు. నువ్వు అనే నువ్వు ఉండవు. పనిచేయకుండా బతికే అధికారం మనకి పోతుంది.

"మహారాజా! ఆలోచించే అధికారంగల మనమే దాని రుచిలోపడి తగువులలో పడితే ఆ అల్పుల సంగతి వేరే చెప్పాలా!"

"చిట్టచివరిగా ఒక్క ముక్క చెపుతాను. తమటోటివాళ్ళ స్థితి గురించి ఒక్క కన్నీటి చుక్క వాళ్ళకంట రాలకుండా చేసి, నీలాంటి రాజులు తమ భాగ్యాలను పోగొట్టుకుంటే చాలు కన్నీటి వరదలో కొట్టుకుపోయేటట్టుగా మలచి మన పూర్వీకులు నిర్మించి మనకోసం వదిలిపెట్టిన సౌధమిది. దీని పునాదులను మాత్రం ముట్టుకోకు సుమా!"

నమస్కరించి, ఆశీర్వచనాలు స్వీకరించి, అయోధ్య వేపు కదిలాడు హరిశ్చంద్ర సార్వభౌముడు.

## 7

'నేను సత్యానికి నిలబడాలని దీక్ష వహించాను. ఏది సత్యంగా కనిపిస్తే దానికోసం అష్టకష్టాలూ పడ్డాను. నేడు నా హృదయం పెద్దయ్య కోరికను మన్నించమంటోంది. హృదయంలో ఉన్నదాన్ని చెప్పటమే సత్యమంటోంది బుద్ధి. అది సత్యమయితే, దాన్ని నేను పాటించకపోతే అది దీక్షా భంగం కాదా? నాకు అనృతదోషం పట్టదా?' రాచనగరుకు

చేరాడు హరిశ్చంద్రుడు. భార్యతో హృదయం విప్పబోయాడు. సాగలేదు.

మంత్రులతో చర్చించబోయాడు.

ముందేం అన్నా - "చివరికి తమ చిత్తం మహారాజా!" - అన్నారు.

చిట్టచివరికి ఆలోచన తెగింది.

మర్నాడు పెద్దయ్యనూ తదితరులనూ సభకి రప్పించాడు.

నిండు పేరోలగంలో నిలబడి ప్రకటించాడు.

"స్మశానాలలో పేదలు సుంకం కట్టనవసరంలేదు. వారు వచ్చి, మాకు మనవి చేసుకుని మా అనుమతి తీసుకుని స్మశానంలో ఉచితంగా శవవిధులు నిర్వహించుకోవచ్చు."

■

(రచన - మే 2002)